## క్లుప్తంగా

### శేష వాహనంపై శ్రీరంగనాథుడు



శేషవాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథుడు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో కొలువుతీరిన శ్రీరంగనాథుడు, శ్రీదేవి, భూదేవి సతీసమేతుడై సోమవారం శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చాడు. శ్రీరంగనాథుడి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శేషోత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామి వారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తుల మధ్య పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు వేదమంత్రాలు చదువుతూ పూజలు చేశారు. వైకుంఠంలో శ్రీమహావిష్ణువు లక్ష్మీదేవి సతీసమేతంగా శేషవాహనంపై కొలువుంటాడని ఈ దర్శన భాగ్యం ప్రతి ఒక్కరికీ దక్కుతుందన్నారు. అనంతరం స్వామి వారిని శేష వాహనంపై కొలువుంచి గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

### బొడ్రాయికి ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

మద్దికెర: మండల కేంద్రంలోని పెనుగొండ ఊరువాకిలి వద్ద ఉన్న బొడ్రాయిని ప్రతిష్ఠించి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొడ్రాయిని ప్రత్యేకంగా చేయించిన నాగ ప్రతిమతో అలంకరించి కుంకుమార్చన, మహామంగళహారతి ఇచ్చారు.అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.దాత లక్ష్మీనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులు, కిట్టి, గ్రామస్తులు గోవిందు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### సేవలతోనే గుర్తింపు



డాక్టర్ రఘురామిరెడ్డిని సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

గోనెగండ్ల: ప్రజలకు అందించిన సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు వస్తుందని గోనెగండ్ల ఆస్పత్రి డాక్టర్ రవళి అన్నారు. గోనెగండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న డాక్టర్ రఘురామి రెడ్డి, స్టాఫ్‌నర్సులు ఉమారాణి, శివ కుమారి, పుష్పవతి, కస్తూరి, నిర్మల, లోకమ్మలతో పాటు హెల్త్ అసిస్టెంట్లు ప్రభావతి, సుజాత, లక్ష్మీదేవి ఇటీవల బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. బదిలీ డాక్టర్, వైద్య సిబ్బందిని డాక్టర్లు రవళి, రజిని, వైద్య సిబ్బంది పూలమాలతో సన్మానించి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఫార్మసిస్ట్ జగదీష్, ఎంపీహెచ్ఈఓలు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

### పోస్టాఫీసులో సొమ్ము భద్రం

ఆలూరు: తపాలా శాఖ ప్రవేశ పెట్టిన పథకాలలో పొదుపు చేస్తే కచ్చితమైన రాబడితో భవిష్యత్తుకు అండగా నిలుస్తుందని ఎస్‌పీఎం రంగన్న అన్నారు. స్థానిక కార్యాలయంలో ఆయన సోమవారం మాట్లాడుతూ.. ఆకర్షణీయ బ్రోచర్లు, ప్రకటనలు, అధిక వడ్డీకి ఆశపడి బోగస్ సంస్థల్లో పెట్టుబడులు పెట్టి నష్టపోవద్దని సూచించారు. తపాలా శాఖ అందిస్తున్న పథకాలతో పక్కా ఆదాయం ఉంటుందని, 7 ముఖ్యమైన పథకాలు ఉన్నట్లు వివరించారు. టాటా బీమా పాలసీలో ఒకేసారి రూ.339 చెల్లిస్తే రూ.10 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. అలాగే సుకన్య సమృద్ధి యోజన, పీఎఫ్ఏ స్కీమ్, ఆర్డీ (రికరింగ్ డిపాజిట్) ఎస్‌బీలు, టీడీ (టైమ్ బాండు) డిపాజిట్లు, ఎన్ఎస్‌సీ (నేషనల్ సేవింగ్స్ స్కీమ్), కిసాన్‌వికాస్ పత్ర్ (కేవీపీ) పథకాల ద్వారా దీర్ఘకాలికంగా మంచి రాబడి పొందవచ్చని వెల్లడించారు.

# నేతన్నకు అభయం

- నేతన్న నేస్తంతో ఏటా రూ.4.77 కోట్ల సాయం
- వార్షిక బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులు
- చేనేత పింఛన్ల ద్వారా నెలకు రూ.39.98 లక్షల పంపిణీ



మగ్గంపై పట్టు వస్త్రాలు నేస్తున్న కార్మికుడు

ఎమ్మిగనూరు: ప్రజా సంకల్ప పాదయాత్ర ద్వారా అణగారిన చేనేత బతుకులను కళ్లారా చూసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వారికి చేయూత నిచ్చేందుకు సంకల్పించారు. చేనేత కార్మికుల కోసం నాలుగేళ్లుగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నారు.గతంలో ఏ ప్రభుత్వం చేయని మేలు ఇప్పుడు చేస్తున్నారు. బడ్జెట్‌లో చేనేతల కోసం ప్రత్యేకంగా రూ.200 కోట్లు కేటాయించి సంక్షేమాన్ని ముందుకు తీసుకెళుతున్నారు. నేతన్న నేస్తం ద్వారా అర్హులైన చేనేత కుటుంబాలకు ఏటా రూ.24 వేలు చొప్పున వారి అకౌంట్లలోనే జమ చేస్తుండటంతో నేతన్నల జీవితాల్లో భరోసా ఏర్పడింది. నియోజకవర్గంలో 1,988 మంది చేనేత కార్మికులకు నేతన్న నేస్తం ద్వారా రూ.4.77 కోట్లు అందుతున్నాయి. ఇక చేనేత కార్మికులకు 50 ఏళ్లకే పింఛన్ అందిస్తూ వారిని ఆదుకొంటున్నారు.1,449 మందికి ప్రతినెలా రూ.39.84 లక్షలు పెన్షన్ల రూపంలో ప్రభుత్వం అందిస్తోంది.

**గత పాలకుల ప్రాపకం ఇలా..**

అగ్గిపెట్టెలో చీరను ఇమడ్చే నైపుణ్యం ఒకప్పుడు ఎమ్మిగనూరు చేనేతల సొంతం. ఇక్కడి చీరలు అంతర్జాతీయ ఖ్యాతిని పొందాయి. మారుతున్న సంస్కృతి, పాశ్చాత్య సంప్రదాయాల మూలంగా చేనేతలకు ఆదరణ తగ్గింది. వారి సంక్షేమార్థం నెలకొల్పిన సంఘాలు, క్లస్టర్లు సైతం అవినీతి ఊబిలో కూరుకుపోయాయి. మాటల గారడితో చేనేతలను ఐదేళ్ల మభ్యపెట్టిన గత పాలకులు పలాయనం చిత్తగించారు. నేసిన నూలు చీరలకు గిట్టుబాటు దక్కక చేనేతలు గద్వాల పట్టు చీరలవైపు మొగ్గు చూపారు. గద్వాల చీరలకు వన్నెలద్ది గిట్టుబాటు సరిచూసుకుంటున్న తరుణంలో ముడి సరుకు అందడం ఆగిపోయింది. దీంతో తిరిగి వెనక్కి చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నాణ్యమైన పట్టును అందించి చీరలను నేయించుకునే మాస్టర్ వీవర్స్ కాలానుగుణంగా నాణ్యత లేని (ట్విస్టెడ్) జెరీని అందిస్తున్నారు. ఈ చీరను నాలుగు రోజుల్లో పూర్తి చేస్తే వచ్చే రూ.800 కూలీ రూ.400లకు పడిపోయింది. చేనేతలు స్వయంగా ముడిసరుకు తీసుకొని తయారు చేసిన చీరలను మాస్టర్ వీవర్స్ వద్ద విక్రయానికి పోతే తక్కువ ధరకు కొనుగోలు చేసి చేనేతల కష్టాన్ని దోచుకున్నారు.

**ఎమ్మిగనూరు నియోజకవర్గంలో చేనేతలు పొందుతున్న సాయం**

| మండలం | నేతన్న నేస్తం లబ్ధిదారులు | ఏటా పొందే సాయం (రూ.) | పింఛను లబ్ధిదారులు | ప్రతినెలా పొందే సాయం (రూ.) |
|---|---|---|---|---|
| మున్సిపాలిటీ | 1,493 | 3,58,32,000 | 1,076 | 29,59,000 |
| ఎమ్మిగనూరు | 239 | 57,36,000 | 155 | 4,26,250 |
| నందవరం | 218 | 52,32,000 | 175 | 4,81,250 |
| గోనెగండ్ల | 38 | 9,12,000 | 48 | 1,32,000 |
| మొత్తం | 1,988 | 4,77,12,000 | 1,454 | 39,98,500 |

### ప్రభుత్వ చేయూత

చేనేతల స్థితిగతుల్లో మార్పు తెచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గుర్తింపు పొందిన చేనేత కార్మికులకు ఏటా రూ.24 వేలు ఆర్థిక చేయూత అందిస్తోంది. జిల్లాలో చేనేత కుటుంబాలు అధికంగా ఉన్న ఎమ్మిగనూరు మున్సిపాలిటీలో 2021-22లో 1,388 మందికి రూ.24 వేలు చొప్పున మొత్తం రూ.3.33 కోట్లు జమ అయ్యాయి. 2022-23లో 1,493 మందికి రూ.3.58 కోట్లు జమ చేశారు. అందుకుముందు రెండేళ్లు చేనేత–జౌళిశాఖ ద్వారా నేరుగా చేనేతల ఖాతాల్లో నగదు జమ అయ్యాయి. నందవరం, గోనెగండ్ల మండలాల్లోని చేనేతలకు నేతన్న నేస్తం సాయమందుతోంది. 50 ఏళ్లకే చేనేత పెన్షన్లు విరివిగా ఇస్తున్నారు. చేనేతలకు ఆరోగ్య కార్డులు మంజూరు చేయడం, చేనేత ఉత్పత్తులకు ఆన్‌లైన్ మార్కెటింగ్ సదుపాయానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. చేనేతల కోసం రూ.200 కోట్లతో ప్రత్యేక వార్షిక బడ్జెట్ రూపొందించడం, చేనేత కార్మికులకు సున్నా వడ్డీ రుణాలు అందించే ఏర్పాట్లు చేసింది. అదేవిధంగా చేనేత సంఘాల పటిష్టతకు, ఆర్థిక పరిపక్వతకు చర్యలు తీసుకుంది.

### నాలుగేళ్లలో రూ.96 వేల సాయం



మగ్గం బతుకులు జీవించడం కష్టమైన సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేనేతలకు దేవుడయ్యాడు. నేతన్న నేస్తం ద్వారా ప్రతి ఏటా రూ.24 వేలు చొప్పున నాలుగేళ్లలో రూ.96 వేల సాయం అందింది. కరోనా కాలంలో జగనన్న సాయం లేకుంటే మా బతుకులు దుర్భరమయ్యేవి. ఇప్పుడు మేము చేనేత కార్మికులం అని గర్వంగా చెప్పుకొనే పరిస్థితిని జగనన్న కల్పించారు.

– టి.లక్ష్మి, చేనేత కార్మికురాలు, నాగలదిన్నె

### జగనన్న చేయూత మరువలేం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న సాయం అంతకుముందున్న వారు ప్రభుత్వాలు చేసి ఉంటే చేనేతలు ఎప్పుడో బాగుపడేవారు. చేనేత పింఛన్ కింద నెలనెలా రూ.2,750 వస్తున్నాయి. నా భార్య మల్లేశ్వరికి నేతన్న నేస్తంతో ప్రతి సంవత్సరం రూ.24 వేలు వస్తున్నాయి. బ్యాంకులు రుణాలు కూడా ఇస్తున్నాయి. జగనన్న ప్రభుత్వంలో చేనేతలు అదృష్టం చేసుకున్నారు. గతంలో చేనేత పనిల వదిలి హోటల్‌లో సర్వర్‌గా పనిచేసేవాడ్ని. జగనన్న వచ్చాక మళ్లీ మగ్గం పట్టా.

– కునిగిరి మల్లికార్జున, చేనేత పింఛనుదారుడు

### పట్టుదలతో చదివితే విజయం తథ్యం

గోనెగండ్ల: స్వేచ్ఛయుత వాతావరణంలో ప్రణాళికబద్ధంగా చదివితే విజయం సొంతం అవుతుందని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరసింహులు విద్యార్థులకు సూచించారు. సోమవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు రామన్, జిల్లా కౌన్సిలర్ జక్రియ మాట్లాడుతూ.. పదవ తరగతి విద్యార్థులకు సందేహాలుంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. అలాగే త్వరలో జరగనున్న పదవ తరగతి పరీక్షలలో విద్యార్థులు రోజు వారి ప్రణాళిక ప్రకారం చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మండలానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రిన్సిపల్ షాహినా పర్వీన్, ఉపాధ్యాయులు రజాక్, చాంద్ బాషా, రాజశేఖర్, సునీత తదితరులు పాల్గొన్నారు.

### కేవీకేలో మట్టి, సాగునీటి పరీక్షలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో మట్టి, నీటి పరీక్షలు చేసుకునేందుకు అవకాశం ఉందని ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ సుజాతమ్మ పేర్కొన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. రైతులు తమ పొలంలోని మట్టి, నీటి సాంపిళ్లను తీసుకొని కేవీకేకు రావాలన్నారు. మట్టి నమూనా పరీక్షల ద్వారా నేలలోని పోషకాల లభ్యత గురించి తెలుసుకోవచ్చని చెప్పారు. నేలలో ఉన్న సేంద్రియ కర్బనం, ఉదజని సూచిక, లవణ శాతం, నత్రజని, భాస్వరం, పొటాష్ మూలకాలు ఎంత మోతాదులో ఉన్నాయో తెలుసుకోవచ్చునని వివరించారు. నేల ఆరోగ్య స్థితిని బట్టి ఏ పంటలు వేసుకోవాలి, ఎరువులు ఎంత మోతాదులో వాడాలనే వివరాలు తెలియ చేస్తామన్నారు. అలాగే నీటి పరీక్షల ద్వారా లవణ శాతం, ఉదజని సూచిక తదితర వివరాలు తెలుస్తాయన్నారు. మట్టి పరీక్షకు రూ.100 (ఒక శ్యాంపిల్‌కు), నీటి పరీక్షకు రూ.60 (ఒక శ్యాంపిల్‌కు) చొప్పున రైతులు చెల్లించాలన్నారు. శ్యాంపిల్ సేకరణలో సందేహాలుంటే 80741 43694 నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

## రెండు నెలలుగా అందని చౌక సరుకులు



హొళగుందలో తహసీల్దారుకు ఫిర్యాదు చేస్తున్న రేషన్‌కార్డుదారులు

హొళగుంద: రెండు నెలలుగా నిత్యావసర సరుకులు పంపిణీ చేయని హొళగుంద ఈబీసీ కాలనీ 31వ రేషన్‌షాపు డీలర్‌పై చర్యలు తీసుకోవాలని రేషన్‌కార్డుదారులు తహసీల్దారు హుసేన్‌సాహేబ్‌కు ఫిర్యాదు చేశారు. పలువురు వార్డు సభ్యులు సోమవారం డీలర్ వహిదాబేగం, భర్త రఫిక్‌పై ఫిర్యాదు చేశారు. చౌక సరుకుల పంపిణీలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, బియ్యంలో కోత విధిస్తున్నారని, చక్కెర, బ్యాళ్లు పంపిణీ చేయడం లేదని ఆరోపించారు. గత నెలలో వేలిముద్రలు నమోదు చేసుకుని టోకన్ ఇచ్చి బియ్యం మాత్రం ఇవ్వలేదని, దీనిపై ప్రశ్నించిన కార్డుదారులతో గొడవకు దిగుతున్నారని వాపోయారు. తమకు రెండు నెలల రేషన్ సరుకులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తహసీల్దారు స్పందిస్తూ సరకులు సక్రమంగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు. ఇదిలాఉండగా ఆలూరు గోడౌన్‌లో డీలర్‌కు రావాల్సిన బ్యాక్‌లాగ్‌లో దాదాపు 30 క్వింటాళ్లు రాలేదని, అక్కడే పక్కదారి పట్టినట్లు సమాచారం. దీంతో ఇక్కడి డీలర్ లబ్ధిదారులకు సరుకులు ఇవ్వడం లేదని తెలుస్తోంది.

## లాభసాటి వ్యవసాయ పద్ధతులపై అవగాహన



రైతులకు సూచనలిస్తున్న జేడీఏ వరలక్ష్మి

ఆలూరు: సాగునీటి సదుపాయం ఉన్న రైతులు లాభసాటి వ్యవసాయంపై దృష్టి సారించాలని జేడీఏ వరలక్ష్మి సూచించారు. దేవనకొండ మండలం కప్పట్రాళ్ల గ్రామంలో సోమవారం డీడీఏ వెంకటేశ్వర రెడ్డి సమక్షంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీఏ మాట్లాడుతూ.. బోరుబావులు, కాలువల నుంచి సాగునీటి వసతి కలిగిన రైతులు పండ్ల తోటలు, ఆకుకూరలు, కూరగాయల పంటలను సాగుచేస్తూ లాభసాటి వ్యవసాయం వైపు దృష్టి సారించాలన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జియాలజిస్టు ద్వారా రైతుల భూములలో సర్వే నిర్వహించిన తర్వాత వైఎస్సార్ జలకళ ద్వారా బోర్లను తవ్వించి డ్రిప్, స్ప్రింక్లర్లను మంజూరు చేస్తున్నామన్నారు. రైతులు కోళ్లు, మేకలు, గొర్రెలు, పాడి గేదెల పెంపకంపై దృష్టి సారించాలని, ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ మంజూరు చేస్తుందని వివరించారు. అనంతరం పశుసంవర్ధక శాఖ జేడీ రామచంద్రయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో సన్న, చిన్న కారు రైతులు పాడి గేదెల పంపకం చేపడితే ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందన్నారు. ప్రధానంగా ముర్రా, జెర్సీ జాతుల పశువుల ఉత్పత్తిని పెంచుకోవడానికి అనేక రకాల వీర్యకణాల ఇంజెక్షన్లు (ఎద సూదులు) అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రస్తుతం రైతుకు ఒక యూనిట్ కింద 2 ఆవులు, 10 మేకలు, 20 కోళ్లు, పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కప్పట్రాళ్ల సర్పంచ్ చెన్నమ్మ నాయుడు, మండల కన్వీనర్ మల్లికార్జున, పత్తికొండ ఏడీఏలు విజయ్‌మోహన్‌కుమార్, సురేష్, ఏఓలు సురేష్ బాబు, చంద్రశేఖర్, ఏఈఏలు యోగేంద్ర, రంగన్న, జయరామ్, వీఏఏలు శివలింగ, రంగన్న, రైతులు పాల్గొన్నారు.

## యూజీడీ పనుల పూర్తికి చర్యలు



పట్టణంలో యూజీడీ నిర్మాణంపై ఎస్ఈకి వివరిస్తున్న అధికారులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో చివరి దశలో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) నిర్మాణ పనులను సత్వరం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని పబ్లిక్ అండ్ హెల్త్ శాఖ ఎస్ఈ శ్రీనాథ్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం పట్టణంలోని గుడికల్ రోడ్డులోని పంప్ హౌస్ వద్ద ఏఐఐబీ వాటర్ స్కీంతో పాటు యూజీడీ పనులు, సోగనూరు రోడ్డులో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణంలో ఇప్పటివరకు చేపట్టిన యూజీడీ పనులను అధికారులు ఆయనకు వివరించారు. పనులు పూర్తి చేసి యూజీడీని పట్టణ వాసులకు అందుబాటులోకి తేవాలని ఆయన అధికారులకు సూచించారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, పబ్లిక్ అండ్ హెల్త్ ఈఈ చంద్రమోహన్ రెడ్డి, డీఈ వెంకటేశ్వర్లు, మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి, ఏఈ ప్రవీణ్‌కుమార్‌రెడ్డితో పాటు పలువురు ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ సుంకర ఉమాదేవి

ఆస్పరి: కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సహకారంతో మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీపీ సుంకర ఉమాదేవి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. వేసవిలో గ్రామాలలో మంచి నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. ప్రభుత్వం శనగలను మద్దతు ధరకు కొనుగోలు చేస్తోందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం హలిగేర ఎంపీటీసీ రహంతుల్లా, తొగలుగల్లు సర్పంచ్ అంజినయ్య మాట్లాడుతూ.. తమ గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించాలన్నారు. ఇందుకు స్పందించిన పంచాయతీ రాజ్ ఏఈ యమునప్ప మాట్లాడుతూ హలిగేర బీటీ రోడ్డుకు రూ.40 లక్షలు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. అంతకుముందు విద్య, వైద్య, వ్యవసాయం, వైకేపీ, విద్యుత్, ఎన్ఆర్ఈజీఎస్ చెందిన అధికారులు తమ శాఖల పని తీరు గురించి వివరించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, ఏంఈఓ రాజేంద్రప్రసాద్, ట్రాన్స్‌కో ఏఈ మల్లికార్జున, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

## అఖండ విజయం అందించాలి



ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ మధుసూదన్‌ను పార్టీ నాయకులకు పరిచయం చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, పక్కన ఎంపీ సంజీవ్‌కుమార్ తదితరులు

పత్తికొండటౌన్: కర్నూలు జిల్లా స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ ఎ.మధుసూదన్‌ను అఖండ మెజార్టీతో గెలిపించేందుకు కృషిచేయాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. సోమవారం సాయంత్రం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పత్తికొండ, తుగ్గలి, మద్దికెర మండలాలకు చెందిన ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు, పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే, ఎంపీ మాట్లాడుతూ.. కర్నూలు స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిని కూడా నిలపలేని స్థితిలో ఉందన్నారు. బడుగు, బలహీనవర్గాలకు అండగా ఉండేది వైఎస్సార్‌సీపీయే అన్నారు. అందరూ సమన్వయంతో పనిచేసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులకు అఖండ విజయం అందించాలని కోరారు. ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ అలంపూర్ మధుసూదన్ మాట్లాడుతూ.. తన అభ్యర్థిత్వానికి జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు అందరూ మద్దతు పలికారని వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఓటు ద్వారా తనను ఆశీర్వదించాలని ప్రజాప్రతినిధులను కోరారు. ఎంపీపీలు నారాయణదాసు, ఆదెమ్మ, జెడ్పీటీసీ సభ్యులు ఉరుకుందమ్మ, మురళీధర్‌రెడ్డి, పులికొండ నాయక్, నాయకులు శ్రీరంగడు, మండల కన్వీనర్లు కారం నాగరాజు, జిట్టా నాగేశ్, డీఎస్ యాదవ్, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**పెట్టుబడుల ఒప్పందాలపై హర్షం**

విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు విజయవంతం కావడంతో పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. పార్టీ నాయకుల సమక్షంలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కేక్ కట్‌చేశారు. పార్టీ కార్యాలయం ఎదురుగా పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషివల్ల రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు రానున్నాయని, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు.

## సంక్షిప్తం

### వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

కృష్ణగిరి: మండల పరిధిలోని చిట్యాల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, కోయిలకొండ సహకార సొసైటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి సోదరుడు రఘురామిరెడ్డి (68) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డితోపాటు పలువురు నాయకులు సోమవారం చిట్యాలకు వెళ్లి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో ఓ మంచి నాయకుడిని కోల్పోయామని, బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మృతుడికి భార్య,ఇద్దరుకుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

### విద్యుత్ స్తంభాల ఏర్పాటు

చిప్పగిరి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా చేపట్టిన జగనన్న కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మండలంలోని నంచర్ల జగనన్న కాలనీలో సోమవారం 22 విద్యుత్ స్తంభాలతో పాటు 4 ట్రాన్స్‌ఫార్మర్లను అధికారులు ఏర్పాటు చేశారు. మండలం మొత్తం మీద నిరుపేదలకు 909 ఇళ్లు మంజూరు కాగా వాటిలో బిలో బేస్‌మెంట్ లెవల్- 604, బేస్‌మెంట్ లెవెల్ – 139, ఆర్‌ఎల్ -14, ఆర్‌సీ – 10, నిర్మాణాలు పూర్తయిన గృహాలు 146 ఉన్నట్లు హౌసింగ్ ఏఈ భవ్య తెలిపారు.

### 'స్పందన' తప్పనిసరి

వెల్దుర్తి: గ్రామ సచివాలయాల్లో రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమం కచ్చితంగా నిర్వహించాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఆయన ఈఓఆర్డీ నరసింహులుతో కలిసి మండల పరిధిలోని రామళ్లకోట, నర్సాపురం సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు, హాజరు పరిశీలించిన అనంతరం సిబ్బందితో మాట్లాడారు. బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. నెలాఖరులోపు వంద శాతం పన్ను వసూళ్లు చేపట్టాలని సెక్రటరీలను ఆదేశించారు.

### టూ వీలర్ రిపేరీపై శిక్షణ

ఆలూరు రూరల్: నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారి ఆదేశాల మేరకు ఆలూరు ఐటీఐ కళాశాలలో టూ వీలర్ రిపేరీలో స్వల్పకాలిక శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ప్రధానమంత్రి కౌశల్ యోజన 4.0 (పీఎంకేవీవై) పథకం కింద టూ వీలర్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సులో చేసేందుకు ఈ నెల 27వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తులను స్థానిక ఐటీఐ కళాశాలలో సమర్పించాలని సూచించారు. దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్, రెండు ఫొటోలు జతచేయాలని, పదవ తరగతి, ఐటీఐ కోర్సుల్లో ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు.

### వంట గ్యాస్ ధర తగ్గించాలి

ఎమ్మిగనూరుటౌన్: పెంచిన వంట గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలని ఏపీ రైతు కూలీ సంఘ నాయకులు ఏసేపు, ఐఎఫ్‌టీయూ నాయకులు హనీఫ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ లక్ష్మన్నకు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. పెంచిన ధరలతో సామాన్యులు వంట గ్యాస్ కొనలేని దుస్థితిలో ఉన్నారన్నారు. వెంటనే ధరలు తగ్గించాలని కోరారు.

### 33వ వార్డు కౌన్సిలర్ ఎన్నికకు ఏర్పాట్లు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని 33వ వార్డు కౌన్సిలర్ శంకరమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆ స్థానానికి ఎన్నికలు నిర్వహించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు వార్డు పోలింగ్ కేంద్రాల డ్రాఫ్ట్ పబ్లికేషన్ నోటిఫికేషన్‌ను మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సోమవారం జారీ చేశారు. స్థానిక మాచాని సోమప్ప ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రంపై డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను పట్టణంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల నోటీసుబోర్డుల్లో ఉంచారు. ఏవైనా అభ్యంతరాలు, సూచనలు ఉంటే మంగళ వారంలోగా మున్సిపల్ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా అందజేయాలని కమిషనర్ కోరారు.

### బహుమతుల ప్రదానం

ఆలూరు: క్రీడాకారులు స్నేహభావంతో మెలగాలని దేవనకొండ జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ సూచించారు. దేవనకొండలో దిగంబర దివాన్ మూగి తాత దర్గా 38వ ఉరుసు సందర్భంగా అంతర్రాష్ట్ర వాలీబాల్ క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ క్రీడల్లో దాదాపు 20 జట్లు పాల్గొన్నాయి. మంత్రాలయం మండలం సూగూరు జట్టు విజేతగా నిలిచి మొదటి బహుమతి రూ 40,016 నగదు అందుకుంది. తరువాతి స్థానాల్లో నిలిచిన అనంతపురం జిల్లా డిఫెన్స్ సోల్జర్స్ జట్టు రూ 30,016, సూగూరు జట్టు రూ.20,016, గుంతకల్లు జట్టు రూ 10,016, దేవనకొండ జట్టు రూ 8,016 దక్కించుకున్నాయి. ఎస్ఐ భూపాలుడు, ఎంపీపీ లక్ష్మిదేవి, మండల కన్వీనర్ మల్లికార్జున, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొని విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు.

### ప్రశాంతతకు భంగం కలిగించొద్దు

ఎమ్మిగనూరురూరల్: గ్రామాల్లో ప్రశాంతతకు భంగం కలిగించకుండా జీవనం సాగించాలని ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం సూచించారు. సోమవారం రాత్రి మండల పరిధిలోని మాసుమాన్‌దొడ్డి గ్రామంలో ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం, రూరల్ సీఐ కె.మోహన్‌రెడ్డి, ఎస్ఐ యు.సునీల్‌కుమార్ పల్లె నిద్ర నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ గ్రామంలో చిన్నచిన్న విషయాలకు గొడవలకు వెళ్లకుండా పెద్దల సమక్షంలో సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. కుటుంబానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, పిల్లలను బాగా చదివించుకోవాలన్నారు.

## క్రైం కార్నర్

### సిలిండర్ పేలి బంకు దగ్ధం



పూర్తిగా దగ్ధమైన బంకు

మద్దికెర:స్థానిక కెనరా బ్యాంకు సమీపంలో ఓ హోటల్ బంకులో సోమవారం తెల్లవారుజామున 2 గంటలకు గ్యాస్ సిలిండర్ పేలడంతో పూర్తిగా దగ్ధమైంది. దాదాపు రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు బాధితురాలు లక్ష్మీదేవి వాపోయారు. చిన్న హోటల్ పెట్టుకొని జీవనం సాగిస్తున్న లక్ష్మీదేవి రోజు మాదిరిగానే తాళాలు వేసి ఇంటికి వెళ్లిపోయింది. అర్ధరాత్రి పెద్ద శబ్దం రావడంతో చుట్టపక్కల వారు చూసి మంటలను ఆర్పి వేశారు.

### గడ్డివామి దగ్ధం



లింగంపల్లిలో కాలిపోతున్న గడ్డివాము

హొళగుంద: మండల పరిధిలోని లింగంపల్లి గ్రామ శివారులో సోమవారం ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో గడ్డివాము కాలి బూడిదైంది. దాదాపు రూ.50 వేలకు పైగా ఆస్తి నష్టం సంభవించింది. గ్రామానికి చెందిన గొల్లరామన్న పాడి పశువుల కోసం కర్ణాటక నుంచి 2 ట్రాక్టర్ల వరిగడ్డి, 2 ట్రాక్టర్ల జొన్నచొప్పను కొనుగోలు చేసి పొలంలో గడ్డివాము వేసుకుని నిల్వ చేసుకున్నాడు. అయితే అగ్ని ప్రమాదంలో మొత్తం కాలిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు.

### క్షుద్రపూజల కలకలం



క్షుద్రపూజలు చేసిన ఆనవాళ్లు

కృష్ణగిరి: పంట పొలాల సమీపంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు చేసినట్లు ఆనవాళ్లు కనిపించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎల్లా నాగిరెడ్డి చెరువు సమీపంలోని మల్లయ్య, తిమ్మగురుడు, లక్ష్మన్న రైతుల పొలాల సమీపంలో క్షుద్రపూజలు చేసినట్లు సోమవారం పొలాలకు వెళ్లిన రైతులు గుర్తించి గ్రామస్తులకు తెలియజేశారు. దీంతో ఆ చుట్టూ ప్రక్కల పొలాలు ఉన్న రైతులు భయాందోళన చెందుతున్నారు. పోలీసు అధికారులు స్పందించి ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.